క్లుప్తంగా

11 నుంచి మాధవీలింగేశ్వర ఆలయ ప్రతిష్టోత్సవాలు



నూతనంగా నిర్మించిన మాధవీ లింగేశ్వర ఆలయం

వెలుగోడు: మాధవరం గ్రామంలో ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించిన మాధవీ లింగేశ్వర ఆలయ ప్రతిష్టోత్సవాలు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు రామచంద్రారెడ్డి, శివశంకర్ రావు, సుధాకర్ రెడ్డి, ఆది నారాయణ రెడ్డి, మేలు వెంకటయ్య, సంజీవరెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ గణపతి శివపార్వతుల, సుబ్రమణ్యేశ్వర, నవగ్రహ, ధ్వజ, నాభిశిలా, గంగమ్మ, పోతురాజుల విగ్రహాలను కూడా ప్రతిష్టించనున్నట్లు చెప్పారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్: భర్త వేధిస్తున్నట్లు ఓ మహిళ నందివర్గం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన షేక్ హుస్సేన్‌బాషా తన కూతురు అయేషాను నాలుగేళ్ల క్రితం చెరువుపల్లె గ్రామానికి చెందిన హైదర్ సాహెబ్‌గారి పెద్ద అబ్బాస్‌మియ్యా కుమారుడు బాషాకు ఇచ్చి వివాహం చేశారు. అయితే బాషా మద్యానికి బానిస కావడంతో పాటు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. విసిగిపోయిన ఆమె ఈ నెల 6వ తేదీ అక్రమ సంబంధంపై భర్తను ప్రశ్నించింది. ఇందుకు ఆగ్రహించిన బాషా కర్రతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో బాషాపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సుంకేసులకు పెరిగిన వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి వరద నీటి ప్రవాహం పెరిగింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో బ్యారేజీకి శనివారం వరద నీటి ప్రవాహం కొంత పెరిగింది. దీంతో పాటు టీబీ డ్యాంకు సైతం స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యా నుంచి నీటి విడుదలను పెంచగా, ఆ నీటితో పాటు వేదావతి నది వరద నీటితో కలిసి మంత్రాలయం దగ్గర 53,500 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రస్తుతం బ్యారేజీకి 52 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఇందులో 12 క్రస్టు గేట్లు మీటర్ పైకెత్తి 49,632 కూసెక్కులు దిగువకు, కేసీ కాలువకు 2012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

టార్గెట్ బాల్ క్రీడల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

పాణ్యం: అసోసియేషన్ జూనియర్స్ మీట్ నిర్వహించిన టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో నంద్యాల జిల్లా మూడవస్థానంలో నిలిచింది. ఈ టీమ్‌లో పాణ్యం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులే అధికంగా ఉన్నారు. శనివారం ప్రిన్సిపాల్ దినేష్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 8న తూర్పు గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ క్రీడలు జరిగాయన్నారు. ఈ క్రీడల్లో నంద్యాల జిల్లా మూడవ స్థానంలో నిలువగా.. ఇందులో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారన్నారు. ఇందుకు కృషి చేసిన పీడీ కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

ఉరుకుందలో భక్తజన సందడి



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ శనివారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. శ్రావణ శుక్రవారంతో పాటు రెండవ శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు సెలవు రోజులు కలిసి రావడంతో శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వివిపీ దర్శనంల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగింది. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.



క్యూ లైన్‌లో తరలివస్తున్న భక్తులు

కల్యాణం..కమనీయం!



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వధూవరులుగా ముస్తాబు చేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరభద్రస్వామిసేవా సమితి సభ్యులు, భక్తులు కల్యాణ వేడుకలను నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలను పఠిస్తుండగా భక్తులు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా తీర్చిదిద్ది కల్యాణ మండపంలోకి చేర్చారు. అనంతరం అర్చకుడు దుర్గాప్రసాద్ వేదమంత్రాలను పఠిస్తుండగా భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువును జరిపించారు. స్వామివారి తరఫున భక్తులు అమ్మవార్ల మెడల్లో మాంగల్యధారణ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలపై భక్తులు తలంబ్రాలు పోసి తన్మయత్వానికి లోనయ్యారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీయాగం



యాగం చేస్తున్న దృశ్యం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన గంగ, గౌరీ మరకతలింగేశ్వరస్వామి, నవగ్రహాల ఆలయాల వద్ద శ్రావణమాసం, పౌర్ణమి పురస్కరించుకుని శనివారం మహాలక్ష్మీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో రుత్వికులు, అర్చకులు విశేష పూజలు జరిపారు. యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహాలక్ష్మీయాగం, పూర్ణా హుతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న కాంతారావు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని నంద్యాల ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు సూచించారు. మండల కేంద్రమైన గడివేములలోని పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షా బంధన్

పగిడ్యాల/పాములపాడు/జూపాడుబంగ్లా: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పగిడ్యాల, పాములపాడు, జూపాడుబంగ్లా మండలాల్లో సోదర, సోదరీమణులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షా బంధన్‌ను ఆడపడుచులు సంతోషంగా తమ సోదరులకు రాఖీ కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకుని జీవిత కాలం మధురంగా కలిసిమెలసి ఉండాలని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం



మండల సమస్యలను సభ దృష్టికి తెస్తున్న సభ్యుడు

వెలుగోడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వైస్ ఎంపీపీ నసిరుద్దీన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు. వచ్చిన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అధికారులు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ పనులు చేపట్టాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ ఇలియాస్‌ఖాన్, విద్యుత్ ఏఈ రవీంద్రనాయక్, ఎంపీటీసీలు చాంద్ బాషా, పల్లె వెంకట్రామ్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు హాజరయ్యారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న జయదేవానంద

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ దైవభక్తితోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ,ధర్మ ప్రచారకులు జయదేవానంద సూచించారు. మండలంలోని రేవనూరులో టీటీడీ ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి కొనసాగుతున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. చివరి రోజు పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సురక్షితంగా ఉంటే ధర్మం సురక్షితంగా ఉంటుందని, భక్తి భావన పెరుగుతుందన్నారు. ప్రజల్లో సమైక్యత భావన నెలకొల్పేందుకు పండుగలు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, సర్పంచ్ సరస్వతమ్మ, భజన మండలి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు వేలం పాటలు పూర్తి



వేలం పాటలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్

నందికొట్కూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం ఎక్సైజ్ శాఖ కార్యాలయం వేలం పాటలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ తెలిపారు. ఎనిమిది వాహనాలకుగానూ రూ.2,54,989 ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ జఫరుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళం

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుకున్న 1993–1999 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, ప్రస్తుత కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, గురుకుల విద్యాలయాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుత నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు తప్పకుండా హాజరై, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగుతున్న నీటి ప్రవాహం



గాలేరు నగరిలో ప్రవహిస్తున్న నీరు

పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వలకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గత నెల 30న గాలేరుకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం గాలేరుకు 13,500 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నారు. 5 వేల క్యూసెక్కుల నుంచి క్రమంగా 13500లకు పెంచి అవుకు రిజర్వాయర్‌కు వదులుతున్నారు. గోరుకల్లు జలాశయంలో ప్రస్తుతం 7 టీఎంసీల నీటిని నిల్వ ఉండగా.. ఎస్సార్బీసీకి 800 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 14వేల క్యూసెక్కుల నీరు వస్తుంది.

దరఖాస్తుల ఆహ్వానం

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయానికి నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చైర్మన్, డిప్యూటీ చైర్మన్‌తో పాటు 11 మంది సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని, ఆసక్తి ఉన్నవారు నంద్యాలలోని రైతు నగరంలో ఉన్న జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చీటింగ్ కేసు నమోదు

బండి ఆత్మకూరు: హైదరాబాద్‌కు చెందిన రాజారెడ్డిపై శనివారం చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని కడమల కాలువ గ్రామానికి చెందిన రాజేష్‌కు చెందిన కారును.. హైదరాబాద్‌లోని రాజారెడ్డి నెల బాడుగకు తీసుకున్నాడని, అయితే బాడుగ ఇవ్వక పోవడం, కారును తిరిగి వెనక్కి ఇవ్వకుండా సతాయిస్తున్నాడని రాజేష్ చేసిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు నమోదు చేశామన్నారు.

గర్భిణులకు అవగాహన సదస్సు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాయుడు, డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా రక్త, మూత్ర పరీక్షలతోపాటు స్కానింగ్ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందిస్తామన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు.

మహిళ బలవన్మరణం

కృష్ణగిరి: కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని ఆలంకొండ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఊడల మద్దయ్యకు కోయిలకొండ గ్రామానికి చెందిన ఊడల లక్ష్మి (29)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కొంత కాలంగా లక్ష్మి కడుపు నొప్పితో బాధపడుతుండగా.. పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాకపోవడంతో ఈ నెల 8న రాత్రి 8 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుమారులు ఇరుగు పొరుగు వారి సహాయంతో డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సలహా మేరకు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి కోడి అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని విద్యార్థికి గాయాలు

బేతంచెర్ల : పట్టణ సమీపంలోని అయ్యలచెరువు కాట వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. మాబాషా అనే విద్యార్థి సైకిల్‌పై వస్తుండగా కర్నూలు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో బాలుడికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమ్మిత్తం వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

బంగారు గొలుసు చోరీ

బేతంచెర్ల : వివాహ వేడుకకు హాజరైన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం చోటు చేసుకుంది. పగిడాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన వసంత జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహ వేడుకకు హాజరై అక్కడే పెళ్లి వారితో కలిసి నిద్రించారు. శనివారం తెల్లవారు జామున తన మెడలోని మూడు తులాల బంగారు చైనును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీనిపై బాధిత మహిళ బేతంచెర్ల పోలీసులకు పిర్యాధు చేసినట్లు తెలిసింది.

సెక్యూరిటీ గార్డ్‌పై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: ఆర్టీసీ డిపో స్వీపింగ్ అండ్ వాషింగ్ సెక్షన్ కాంట్రాక్టు కార్మికురాలు దళిత లక్ష్మిని కులం పేరుతో దూషించి దుర్భాషలాడిన ఆర్టీసీ సెక్యూరిటీ గార్డ్ కరీమున్నీసాపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.భాస్కర్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.రామ్‌నాయక్, ప్రజా సంఘాల నాయకులు స్వాములు, సుధాకర్, నాగరత్నం డిమాండ్ చేశారు. శనివారం వారు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి కరిమున్నీసాపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు.

మరకతలింగేశ్వరుడికి మేఘాల అభిషేకం!

నింగిలో నీటి అలల్లా.. ఆకాశంలో దారేశారా అన్నట్లు మేఘాలు కనువిందు చేశాయి. నీలాకాశంలో మేఘాలు హొయలొలికాయి. చూడటానికి వివిధ రకాలుగా ఉన్నాం మీరే వర్ణించుకోండంటూ వయ్యారంగా నాట్యమాడాయి. మహానంది మండలం గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద కొలువైన గంగ, గౌరీ సమేత మరకతలింగేశ్వర స్వామి, నవగ్రహ ఆలయాల పైభాగాన మేఘాలు ఇలా ముచ్చట గొలుపుతూ భక్తులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. – మహానంది



అహోబిలంలో పౌర్ణమి పూజలు



ప్రత్యేకలంకరణలో కొలువైన ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు నిత్య పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయం ముఖ ద్వారం మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. తర్వాత దూపదీపాలతో మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం నివేదించారు. రాత్రి విశేషాలంకరణలో స్వామి ఉభయ దేవేరులతో కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. తిరిగి దేవాలయం చేరుకున్న అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు

సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరు



మండల సర్వ సభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అల్లాం బాషా ఆధ్వర్యంలో ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్, వెటర్నరీ, విద్యుత్ శాఖ, మైనర్ ఇరిగేషన్, రోడ్లు బిల్డింగ్‌ల శాఖ, అటవీ, ఉద్యానశాఖ అధికారులు డుమ్మా కొట్టారు. వచ్చిన అరకొర అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గతంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కారమయ్యాయా లేదా అనేది ఎవరూ చెప్పలేదు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, అదే సమయంలో యూరియా కొరతను పూడ్చే నానో యూరియా వాడకంపై రైతులక అవగాహన కల్పించాలని, ఆత్మకూరు నుంచి గువ్వలకుంట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, గువ్వలకుంట్ల నుంచి పాలెంచెరువు గూడెంకు రహదారి నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ స్రవంతి సభ దృష్టికి తెచ్చారు. ఎదురుపాడు గ్రామంలోని పాఠశాలకు వెళ్లేందుకు దారిలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు అధికారులకు విన్నవించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ, డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓ నాగరాజు, ఏపీఎం పుల్లయ్య, ఏపీఓ విమలమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ, వైద్యాధికారులు మహమ్మద్ బేగ్, జబీర్, జూబేదా, ఎంపీటీసీలు శివన్న, మాబీనాబేగం, రమిజాబీ, కో–ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, సర్పంచులు చందమాల శోభలత, బాలఎల్లయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజీలేని పోరాటాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పారాటాలు చేయాలని సీఐటీయూ నాయకులు యేసురత్నం, రజాక్, రామ్‌నాయక్ అన్నారు. పట్టణంలోని సుదర్శనవర్మ భవనంలో సీఐటీయూ పట్టణ మూడో మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోరాటల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదించి కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వంపై కలసికట్టుగా పోరాడేందుకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. అంతకుముందు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, సుబ్బయ్య, రణధీర్, పెద్దనాగన్న, మంజుల, శాంతి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.